


సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

నిజామాబాద్
కామారెడ్డి

బుధవారం 23 ఏప్రిల్ 2025 6 పేజీలు



### పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల

# లబ్ధిదారుల ఎంపిక

- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఏప్రిల్ 30 లోపు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రతి దశలో లబ్ధిదారులకు సహకారం అందించాలి
- ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ఎల్.ఆర్.ఎస్ పై కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి పొంగులేటి




**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

పేదల సొంతింటి కల నిజం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత లబ్ధిదారుల ఎంపికను అధికారులు పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌతమ్ లతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి పై కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ (మిగతా 2లో)



# ఆగని అక్రమ తవ్వకాలు

- మండలంలో యథేచ్ఛగా మొరం, మట్టి తవ్వకాలు
- గుట్టలు, ప్రభుత్వ స్థలాలే టార్గెట్
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ప్రజాప్రతినిధుల అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు

**సూర్య కమ్మర్ పల్లి**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని నర్సాపూర్ గ్రామంలో మొరం తవ్వకాలు అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నాయి.గుట్టలు, ప్రభుత్వ భూములనే తేడా లేకుండా అనుమతులు తీసుకున్న వారు మినహాయిస్తే అక్రమార్కులు ఇష్టం వచ్చిన రీతిలో తవ్వకాలు చేస్తున్నారు. వెంచర్‌లు, భవన నిర్మాణాలకు సరఫరా చేస్తూ వారు నిర్ణయించిందే ధరగా అమ్ముతున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాలలో సిండికెట్‌గా మారి (మిగతా 2లో)



### పీఎం శ్రీ నిధులతో

# శంకర్ భవన్ పాఠశాల అభివృద్ధి

### - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ

**సూర్య - మోపాల్**

కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పీఎంశ్రీ నిధుల ద్వారానే శంకర్ భవన్ పాఠశాల అభివృద్ధి జరుగుతుందని అర్బన్ ఎమ్మెల్యే దాన్ పాల్ సూర్య నారాయణ గుప్తా అన్నారు. మంగళవారం పాఠశాల వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాలు, నాణ్యతను మెరుగు పర్చడానికి పీఎంశ్రీ పతకం కింద గతేడాది (మిగతా 2లో)



### భూభారతి చట్టంతో

# భూ సమస్యలు పరిష్కారం

### - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించ డానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం 14 ఏప్రిల్ 2025న ప్రారంభించడం (మిగతా 2లో)





### భూగర్భ జలాలను సంరక్షణకు అవసరమైన కట్టడాలు

# నిర్మించుకునేందుకు సిద్ధం చేయాలి



### - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

భూగర్భ జలాల సంరక్షణకు అవసరమైన కట్టడా లు నిర్మించుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. డిస్ట్రిక్ లెవెల్ వాచ్ డాగ్ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్ మినీ (మిగతా 2లో)

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక

**(మొదటి పేజీ తరువాయి)**

ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పేదవాడు సొంత ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రజా ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలను ఉచితంగా సబ్సిడీ కింద అందిస్తుందని, దేశంలో మరే రాష్ట్రంలో ఇంత పెద్దన సాయం అందడం లేదని, మిగిలిన రాష్ట్రాల్లో లక్షన్నర నుంచి 3 లక్షల వరకు ప్రభుత్వాలు సహాయం చేస్తుంటే మన తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను అందిస్తుందని మంత్రి తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి విడత లో 3 వేల 500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతి పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని అన్నారు. మనకు వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు, జనాభా ఆధారంగా గ్రామాలకు, మున్సిపల్ వార్డులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పూర్తి చేయాలని అన్నారు. గ్రామాలు, మున్సిపల్ వార్డులో ఉన్న ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల జాబితా ఎంపిక చేయాలని, ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్లకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి ఏప్రిల్ 30 లోపు మరో సారి ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి నాణ్యతతో పారదర్శకంగా జరగాలని, ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే మంజూరు చేసే జాబితా నుంచి తొలగించాలని అన్నారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన పైలెట్ గ్రామంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లలో బేస్మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న వారికి మొదటి విడత కింద లక్ష రూపాయలను ఇటీవలే విడుదల చేశామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పెద్ద సంఖ్యలో గ్రౌండ్ అవుతున్న నేపథ్యంలో ఎక్కడ సామాగ్రి ధరలు అనుభవంగా పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాపారులు ఎక్కడ కృత్రిమ కొరత సృష్టించకుండా చూడాలని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చూడాలని, బలహీన వర్గాల ఇంటి నిర్మాణానికి ఉచితంగా సరఫరా చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నందున, ప్రతి మండల కేంద్రంలో ఇసుక అందుబాటులో పెట్టాలని మంత్రి తెలిపారు. మండలంలో నిర్మించిన మోడెల్ ఇండ్లు నమూనాలను లబ్ధిదారులకు చూపించాలని మంత్రి అధికారులకు సూచించారు. పేదలకు ఇంటి నిర్మాణంలో ప్రతి దశ లోను అధికారులు సహాయం అందించాలని మంత్రి పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభం కంటే ముందే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని అన్నారు. 5 లక్షల రూపాయల వరకు సబ్సిడీ ఇస్తున్నందున అత్యంత నిరు పేదలకు మొదటి విడతలో ఎంపిక చేయాలని అన్నారు. సివిల్ ఇంజనీరింగ్ లో అత్యుత్తమ మార్కులు వచ్చిన యువకులను తాత్కాలిక ప్రాతిపదికన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇంజనీర్లుగా నియమిస్తున్నామని, వీరికి అవసరమైన శిక్షణ అందించి త్వరలోనే మండలాలకు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. భూ భారతి చట్టాన్ని క్షేత్రస్థాయిలో తూచ తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లు, జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పై అధికంగా ఉంటుందని అన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రజలకు భారం కాకుండా 25% రాయితీని అందించామని, దీనినే ముఖ్యమంత్రి ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించామని అన్నారు. మరోసారి ఎల్.ఆర్.ఎస్ 25% రాయితీ గడువు పొడిగింపు మరొక్కసారి ఉండదని ఈ అంశాన్ని ప్రజలకు విస్తృతంగా తీసుకుని ఎళ్లి, ఆమోదం పొందిన దరఖాస్తుల ఫీజులు వసూలు చేసి క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద లింగంపేట్ మండలంలో భూ భారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మండలంలో 23 రెవిన్యూ గ్రామాలు ఉన్నాయని, నేటివరకు 8 గ్రామాల్లో సదస్సులు నిర్వహించామని తెలిపారు. ఇట్టి సమావేశాల్లో పలు సమస్యలపై 810 దరఖాస్తులు రావడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, చందర్ నాయక్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అటవీ అధికారిణి నికిత, ఆర్డీఓ లు వీణ, మన్నే ప్రభాకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆగని అక్రమ తవ్వకాలు

**(మొదటి పేజీ తరువాయి)**

అమ్మకాలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలు ఉండడంతో యంత్రాంగం కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ఏ దైనా గ్రామం నుంచి ఫిర్యాదు వస్తే తప్పా ఆ వైపు దృష్టి పెట్టడం లేదు. అక్రమ తవ్వకాలను ఆపడం లేదు. జిల్లాలో ప్రభుత్వ అవసరాలతో పాటు భవన నిర్మాణానికి మొరం, మట్టి తవ్వకాల కోసం ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో అనుమతులు ఇచ్చింది. ఆ ప్రాంతాల్లో మాత్రమే తవ్వకాలు చేయాలని కోరింది. ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం మరికొన్ని గ్రామాల్లో రెవెన్యూ అధికారులు మట్టి, మొరం తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. నర్సాపూర్, కమ్మర్ పల్లి, ఉప్లూర్, బషీరాబాద్ కొన్ని గ్రామాల్లో ప్రైవేటు అవసరాల కోసం రెవెన్యూ, గనులు, భూగర్భశాఖ అనుమతులు ఇవ్వలేదు. ఈ ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తూ ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారు. ఎక్కువగా గుట్టలను ఆక్రమిస్తూ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుట్టలలో మట్టి తవ్వకాలకు అనుమతులు లేవు. పర్యావరణ అనుమతులు ఇవ్వడం లేదు. మండలంలోని పలు గుట్టల్లో ఈ అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. కొన్ని చోట్ల అసైన్డ్ భూముల్లో తవ్వకాలు చేస్తున్నారు. అధికారులు అడిగితే భూమిని చదును చేస్తున్నామని చెప్పి మట్టి, మొరాన్ని తరలిస్తున్నారు. చుట్టుపక్కల గుట్టలు, ఇతర భూముల నుంచి తవ్వకాలు చేస్తూ అమ్ముతున్నారు. ప్రజాప్రతినిధుల అండ ఉండడంతో యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఈ మొరంనకు సిండికేట్ నిర్ణయించిందే రేటుగా అమ్మకాలు చేస్తున్నారు. టిప్పర్‌కు రూ.2,500 నుంచి రూ.3,500 మధ్య అమ్ముతున్నారు. గుట్టల నుంచి తవ్వుతూ అమ్మకాలు చేస్తున్నారు. గ్రామాలలో భవన నిర్మాణంతో పాటు ప్రైవేట్ స్థలాలకు సరఫరా చేస్తున్నారు. సిండికేట్ నిర్ణయించిందే రేటు కావడంతో అనుమతులు పొందిన వారు కూడా వీరు చెప్పిన విధంగానే మొరం సరఫరా చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడం వల్ల తమ ముందు నుంచే వాహనాలు వెళ్లినా అధికారులు పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి సమాచారం వస్తే తప్పా వాటిని సీజ్ చేయడం లేదు. ఎవరైనా అడిగితే అధికారుల అండదండలు ఉన్నాయని చెబుతూ మొరం తవ్వకాలను చేస్తున్నారు. బాహటంగా పగటి పూటనే గుట్టలు తవ్వి సరఫరా చేస్తున్న రెవెన్యూ, అటవీ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. ఒకవేళ ఎవరైనా పట్టుకున్నా ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్‌లు వస్తుండడంతో పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

**- ఫారెస్టు భూముల్లోనూ అక్రమ తవ్వకాలు**

మండలంలో రిజర్డ్ ఫారెస్ట్ పరిధిలో మట్టి, మొరం తవ్వకా లు జరుగుతున్నా అటవీ శాఖాదికారులు పట్టించుకోవడం లేదు. పోడు పేరుతో వ్యవసాయం చేసే వారిని భూముల నుంచి పంపిస్తున్న అధికారులు గుట్టలను తవ్వుతుంటే మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మట్టి, మొరం తవ్వకా లు చేసే వారు ఎక్కువ మంది ప్రజాప్రతినిధుల అనుచరు లు కావడం లేదా వారి బంధువులు పదవుల్లో ఉండడం వల్ల కిందిస్థాయి అధికారులు కూడా పట్టుకునేందుకు జంకుతున్నారు.

# నాగిరెడ్డి పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత " నిల్ "

## - ప్రభుత్వ కళాశాలల్లో అధ్వాన్నంగా ఇంటర్ ఫలితాలు

**సూర్య నాగిరెడ్డిపేట్**

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత నీల్ రిజల్ట్ వచ్చినట్టు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు. నాగిరెడ్డిపేట్ మండల కేంద్రానికి నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. 2024-25 విద్యా సంవత్సరంలో కళాశాల ను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రారంభించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో వివిధ గ్రూపులకు చెందిన 45 మంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాయగా 45 మంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయినట్టు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు.

# నిజామాబాద్ జిల్లా జడ్జి గా జివిఎన్ భారత లక్ష్మి

**సూర్య - మోపాల్**



నిజామాబాద్ జిల్లా జడ్జి గా జివిఎన్ భారతలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది న్యాయవాదులు కలిసి స్వాగతం పలికారు. భారత లక్ష్మి హైదరాబాద్ లోని లేబర్ కోర్టు లో ప్రీసైడింగ్ ఆఫీసర్ గా పనిచేసిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆమె నిజామాబాద్ కు బదిలీ పై వచ్చారు. కాగా ఇక్కడ పనిచేసిన జిల్లా జెడ్జి సునీత కుంచాల పెద్దపల్లి జిల్లా జడ్జి గా ట్రాన్స్ ఫర్ అయ్యారు. ఆమె ఇక్కడ సుదీర్ఘ కాలం పని చేసారు.

# పీఎం శ్రీ నిధులతో శంకర్ భవన్ పాఠశాల అభివృద్ధి

**(మొదటి పేజీ తరువాయి)**

రూ. 27లక్షలు, అటల్ టింకరింగ్ ల్యాబ్ కోసం రూ. 10లక్షల నిధులు కేటాయించామన్నారు. మాన ఊరు- మన బడి,అమ్మ ఆదర్శ పాఠశాలల పతకాలు పేరుకే పరిమితమవుతున్నాయని. అర్బన్ నియోజిక వర్గ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందించడమే తన లక్యం అన్నారు. భవిషత్తులో శంకర్ భవన్ పాఠశాల అభివృద్ధికి తన ట్రస్ట్ ద్వారా సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్య శాఖ అధికారి అశోక్, ఎంఈవో సాయరెడ్డి,ప్రధానోపాధ్యాయులు మల్లేశం,రాంచందర్, టీఫీటీఎఫ్ నాయకుడు వెనిగల్ల సురేష్,ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలను సంరక్షణకు అవసరమైన కట్టడాల నిర్మించుకునేందుకు సిద్ధం చేయాలి

**(మొదటి పేజీ తరువాయి)**

సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లాలో మూడు మున్సిపాలిటీ లలో కురువనున్న వర్షపు నీటి సంరక్షణ పైన చర్యలు, వాటి పై సర్వే నిర్వహించి సమాచారం తెలపవలిసిందిగా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ వేసవి కాలం లో భూగర్భ జలాలు సంరక్షణ కట్టడాల కు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయవలసిందిగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని ఆదేశించారు. వాగులను గుర్తించి వాటిపైన అడ్డుగా రాతి కట్టడాలను నిర్మించాలని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ ను కలెక్టర్ ఆదేశించారు. మన జిల్లాలో భూగర్భ జలాలు చాలా వేగంగా పడిపోతు న్నాయి, రాబోయే ఎండాకాలం లో భూగర్భ జలాల సంరక్షణ కోసం ఫాంపాండ్స్, బోరేవెల్ రీఛార్జ్ స్ట్రక్చర్, ఇంకుడు గుంతలు, సోక్ పిట్స్ ఎక్కువ నిర్మించాలని , వచ్చే వర్ష కాలం లో ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టి భూమిలోకి ఇంకే లాగా యాక్షన్ ప్లాన్ చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టరు చందర్ నాయక్ ,జిల్లా భూగర్భ జల అధికారి సతీష్ యాదవ్, మున్సిపల్ కమీషనర్ లు రాజేందర్, శ్రీహరి, మహేష్ లు, ఇరిగేషన్ , పంచాయతీ రాజ్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం

**(మొదటి పేజీ తరువాయి)**

జరిగిందని తెలిపారు. చట్టం పై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తునా ్నమని తెలిపారు. ధరణి స్థానంలో కొత్తగా భూభారతి (భూమి హక్కుల చట్టం) తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చుని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని సూచించారు. 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసి, గడచిన 12 ఏండ్లుగా అనుభవం లో ఉంటూ 12.10.2020 నుండి 10.11.2020 మధ్య కాలంలో క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. అట్టి వాటిని రికార్డులలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ, పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటే షన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. భూదార్ కార్డుల జారీ, రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతు ందని తెలిపారు. ఈ చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని అన్నారు. సాదా బైనామాలు, వారసత్వంగా వచ్చిన భూములపై 30 రోజుల్లోగా విచారణ చేయడం జరుగుతుందని, ఒకవేళ అట్టి గడువులోగా విచారణ చేయని పక్షంలో రిజిస్ట్రేషన్ అయినట్లుగా భావించవచ్చని తెలిపారు. ప్రజలు ఈ చట్టం పై అవగాహన ఏర్పర్చుకో వాలని, వారికి ఉన్న భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం మే మొదటి వారం నుండి గ్రామాలలో సదస్సులు నిర్వహించేందుకు వచ్చే అధికారులకు అర్జీలు సమర్పించవచ్చని సూచించారు. కాగా, అంతకు ముందు మెండోరా మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని రైతులకు భుభారతి చట్టంలోని కీలక అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సదస్సులలో రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్, స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# సిల్వర్ జూబ్లీ వేడుకలకు మంత్రి జూపల్లి

## - పోచారం

**సూర్య-బాన్సువాడ**



బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలకు నిజామాబాదు ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు విచ్చేస్తున్నారని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలోఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల24ననిర్వహించే కళాశాల సిల్వర్ జూబ్లికి పూర్వ విద్యార్థులు అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. బాన్సువాడ నియోజకవర్గంలో మారుమూల ప్రాంతాలు కావడంతో,ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లలేక చదువులను మధ్యలోనే ఆపేవారని అన్నారు. బాన్సువాడలో డిగ్రీ కళాశాల కోసం ఎంతో కృషి చేశానని, 1998లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని నెంబర్ వన్ కళాశాలగాబాన్సువాడకళాశాలకొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు కళాశాలలో చదువుకున్న 10 వేల మంది విద్యార్థులు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. కళాశాల న్యాక్ బి ప్లస్ గ్రేడ్ తో స్వయం ప్రతిపత్తి కలిగి ఉందన్నారు.కళాశాలసిల్వర్ జూబ్లీ వేడుకల కరపత్రాలను ఆవిష్కరణచేశారు.ఈసమావేశంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, ప్రిన్సిపాల్ వేణుస్వామి, బీర్కూరు ఏఎంసీ చైర్మన్ శ్యామల, నాయకులు కృష్ణారెడ్డి సురేష్, అంజిరెడ్డి, వెంకన్న గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## చౌదరి చెరువు తూము నిర్మాణా పనులు ప్రారంభం

**సూర్య,లింగంపేట్**



లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో మంగళవారం చౌదరి చెరువు తూము నిర్మాణా పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. గత నాలుగు సంవత్సరాల క్రితం గండిపడి తూము తెగిపోయింది.అప్పటి నుండి చౌదరి చెరువు ఆయకట్ట కింది రైతులు వర్షాకాలం, యాసంగిలో చౌదరి చెరువు నిండుకుండల నీళ్లు ఉన్నా ఆయకట్ట కింది రైతులు నష్టపోతున్నారు. ఇట్టి విషయంలో గ్రామస్తులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావ్ దృష్టికి తీసుకుపోవడంతో స్పందించిన ఎమ్మెల్యే నూతన తూమ్ నిర్మాణానికి ఎస్డిఫ్ నిధుల నుండి 37 లక్షలు రూపాయలు మంజూరు చేశారు.చెప్పగానే తూము నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మదన్మోహన్ రావ్ కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మనిగిరి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి అశ్వక్,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కలాలి అజయ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాసుల శివకుమార్, ఉపాధ్యక్షుడు తలారి శ్రీనివాస్,బండారు సంజీవరెడ్డి,మాసుల కృష్ణమూర్తి, దాసరి శ్రీనివాస్,బండ రమేష్, చిలమంతుల సతీష్,చాకలి కుమార్,బాసు చంద్రయ్య,సూరంపల్లి యాదగిరి,అర్కారి ఆగమయ్య,వడ్ల రాజు,అజయ్,నిజ్జన నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సిద్ధి రామేశ్వర ఆలయ హుండి లెక్కింపు

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్ర శివారులోని దక్షిణ కాశీగా పిలవబడే శ్రీ సిద్ధిరామేశ్వర ఆలయ హుండీ లేక్కింపు కార్యక్రమం మంగళవారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఆలయంలో ఉన్న ఐదు హుండీలను లెక్కించగా మూడు లక్షల 63 వేల 562 రూపాయల నగదు ఆదాయం వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ రామారావు తెలిపారు. నాలుగు నెలల కాలంలో భక్తులు సమర్పించిన కట్న కానుకలను ఆలయ సిబ్బంది సమక్షంలో లెక్కింపు జరిపినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి పద్మ శ్రీధర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అందే మహేందర్ రెడ్డి, తాటిపాముల లింబాద్రి, ఆలయ ప్రధాన అర్చకులు కొడకండ్ల రామగిరి శర్మ, ఆలయ సిబ్బంది సేవకులు పాల్గొన్నారు

## వరి ధాన్యపు కొనుగోలు వేగవంతం చేయాలి

**సూర్య- బిక్కనూర్**



వరి ధాన్యపు కొనుగోలు వేగవం తం చేయాలని జిల్లా సహకార అధికారి రామ్మోహన్ సొసైటీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దమల్లా రెడ్డి సింగిల్ విండో సొసైటీ పరిధిలో వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఏర్పాటు చేసిన నీటి వసతి, టెంటు సౌకర్యం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ అధికారి రమేష్, మానిటరింగ్ అధికారి నగేష్, సొసైటీ సీఈవో మోహన్ గౌడ్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## రజితోత్సవ సభకు భారీగా తరలి రావాలి

**సూర్య- బిక్కనూర్**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన పార్టీ బిఆర్ఎస్ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27వ తేదీన వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో నిర్వహించే పార్టీ రజితోత్సవ సభకు మండలం నుండి వేలాదిగా పార్టీ నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బహిరంగ సభ సన్నాహక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నమ్మి అధికారం అప్పగిస్తే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని, పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ ముందుకెళ్లాలని, రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అత్తిలి శ్రీనివాస్, ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బోండ్ల రామచంద్రం, దాయారి సాయి రెడ్డి, భూమ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తునికి వేణు, ఏనుగు వెంకట్ రెడ్డి, వంగేటి నర్సారెడ్డి, జిల్లాల రవీందర్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించిన అంతంపల్లి విద్యార్థిని

**సూర్య- బిక్కనూర్**



ఇంటర్ ఫలితాలలో మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని వలకొండ చర్విత ఎంపీసీలో 995 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించింది. అంతంపల్లి సింగిల్ విండో సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి- అనురాధ దంపతుల రెండవ కూతురైన చర్విత చిన్నప్పటినుండి ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఇంటర్మీడియట్లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, మండలవాసులు రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన చర్వితను అభినందించారు.

## కాలేజ్ టాపర్ గా నిలిచిన స్వజిత విశ్వామితి

**సూర్య రాజంపేట**



రాజంపేట మండల కేంద్రానికి చెందిన సతీష్ శ్రీపర్ణ ల కూతురు స్వజిత విశ్వామితి శ్రీ గాయత్రీ కాలేజీ, మల్లపేట, హైదరాబాద్లో కాలేజీ టాపర్గా నిలవడం గర్వకారణమని తెలిపారు అద్భుత ప్రతిభతో కాలేజీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిందని అభినంది ంచారు. ఈ సందర్భంగా స్వజిత విశ్వామితి ఆమె తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు గ్రామస్థుల నుండి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. భవిష్యత్తులో కూడా ఈవిధంగానే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ పలువురు ఆశీర్వాదాలు తెలిపారు. స్వజిత విశ్వామితి ఈ విజయాన్ని తన తల్లిదండ్రులు సతీష్ శ్రీపర్ణ ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం ఫలితంగా అభివర్ణించింది.

## జిల్లా జడ్జి ని కలిసిన సీపీ సాయి చైతన్య

**సూర్య -మోపాల్**



నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జీవీఎన్ భారతలక్ష్మి ని సీపీ సాయి చైతన్య మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెను మంగళవారం జిల్లా కోర్టులో కలిసి పుష్ప గుచ్ఛం అంద జేశారు. అనంతరం పలు అంశాలపై సీపీ సాయి చైతన్య చర్చించాడు.

## పోషణ పక్షం అవగాహన

**సూర్య బాల్కొండ**



పోషణ పక్షంలో భాగంగా చివరి రోజు కావున మండల స్థాయి బాల్కొండ మండల స్థాయి పోషణ పక్షం అవగాహన కార్యక్రమము జలాల్పూర్ గ్రామంలోని ప్రైమరీ స్కూల్ పరిధిలో ఉన్న అంగన్వాడి సెంటర్ లో నిర్వహించడం జరిగింది థౌసండ్ డేస్ గోల్డెన్ డేస్ గురించి పోషకాహార ప్రాముఖ్యత గురించి పరిశుభ్రత ప్రశాంతత గురించి మహిళలకు తగు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది తదుపరి సీమంతము అన్నప్రాసన చేయడం జరిగింది పోషణ పక్షంలో పోషకాహార ప్రాముఖ్యత గురించి ప్రతిజ్ఞ చేయించడం కూడా జరిగింది మొత్తం మీద ఏ ఇంటిలోను ఏ ఊరిలోనూ ఎవరిలోనూ కుపోషణ లేని గ్రామంగా ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రమాదేవి అంగన్వాడీ టీచర్లు సిఏ, వీడిసి చైర్మన్ ,పాఠశాల హెచ్ఎం అభిమన్యు సర్ సూపర్వైజర్ పాల్గొన్నారు.

## మహారాణి ఆలియా భాయ్ హల్కర్ త్రీ శతాబ్ది ఉత్సవాలు

**-తపస్ జిల్లా అధ్యక్షులు పుల్గామ్ రంగారెడ్డి**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లా కేంద్రంలో తేదీ :24 ఏప్రి ల్ 2025 గురువారం రోజున, "మహారాణి అల్యాబాయ్ హోల్కర్"గారి త్రి శతాబ్ది ఉత్సవం మరియు "నూతన ఎమ్మెల్సీల సన్మాన "కార్యక్రమమం కలదు . కావున ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పుల్గం రాఘవరెడ్డి, భునేకర్ సంతోష్ కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీలో రమేష్ కుమార్ , జిల్లా ఉపాధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్ ,గిరి,వివిధ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్, శంకర్ శ్రీకాంత్ రెడ్డి ,స్వామి ,సతీష్ వేదమిత్ర ,తదిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఉచిత పశు వైద్య శిబిరం

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్రంలో మంగళవారం మార్కెట్ కమిటీ, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి డాక్టర్ దేవేందర్ పశువులకు వివిధ రకాల టీకాలు ఇచ్చారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ పాడి రైతులు పశువులలో సోకే వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని, సరైన సమయంలో టీకాలు ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, వైస్ చైర్మన్ స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పశు వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

**-అర్బన్ ఎమ్మెల్యే**

**సూర్య - మోపాల్**



రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా అన్నారు. మంగళవారం గౌతమ్ నగర్లో మండల వనరుల కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణ పనులు నాణ్యతలో త్వరగాపూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూసించినట్లు చెప్పారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తూన్న సౌకర్యాలు తల్లిదండ్రులకు వివరించి చిన్నారులు బడిలో చేరే విదంగా అవగహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఈవోఅశోక్ ఎంఈవో వెంకట్ నారాయణ, ఏఈఉదయ్ కిరణ్, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలో ఎకో టూరిజం

## - ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడి - కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్ష

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాలను ఎకో టూరిజం ప్రదేశాలుగా తీర్చిదిద్దుతామని ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే నందిపేట మండలం ఉమ్మెడ, జలాల్పూర్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించేందుకు ఎకో టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్ తో కలిసి సీసీఎఫ్ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం నిజామాబాద్ పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి అటవీ, రెవెన్యూ, నీటి పారుదల తదితర శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలో ఎకో టూరిజం అభివృద్ధి కోసం అనువైన పరిస్థితుల గురించి కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ చీఫ్



కన్జర్వేటర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సమగ్ర వివరాలతో నివేదికలు సమర్పిస్తే, తక్షణమే మంజూరీ తెలుపుతూ, నిధులు కేటాయిస్తామని అన్నారు. రాష్ట్రంలోని అనువైన ప్రాంతాలను పర్యావరణహితంతో కూడిన పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ఎకో టూరిజం అభివృద్ధి చర్యలలో భాగంగా 25 సఫారీ వాహనాలను కొనుగోలు చేశామన్నారు. ఎకోటూరిజం అభివృద్ధితో ప్రజలకు కూడా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. నందిపేటలో ఎకో టూరిజం అభివృద్ధి పనులలో భాగంగా సఫారీ వాహనాల కొనుగోలు, వాచ్ టవర్, పార్కింగ్ ప్రదేశం, రెస్టారెంట్లను మొదటగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తా మని అన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలు అయిన ఉమ్మెడలో 1.20 ఎకరాలు, జలాల్పూర్ లో 3 ఎకరాలలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. ఉమ్మెడ నుండి బాసర వరకు బోటింగ్ ప్రణాళికను కూడా సిద్ధం చేస్తామని అన్నారు. అలాగే ఉమ్మెడ నుండి గాదెపల్లి వరకు - 20 కి.మీ, గాదెపల్లి నుండి జలాల్పూర్ వరకు - 16 కి మీ సఫారీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. 3 రోజులలో సమగ్ర ప్రణాళికలు, కావల్సిన నిధుల వివరాలతో నివేదిక సమర్పిస్తే, వెంటనే బడ్జెట్ విడుదల చేస్తామన్నారు. ఈ సమీక్షలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, ఆర్డీఓ రాజాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

## -ప్రత్యేక అధికారి సురేందర్

**సూర్య,లింగంపేట్**



వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ప్రత్యేక అధికారి సురేందర్ అన్నారు. మంగళవారం మండల సమైక్య కార్యాలయంలో సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో త్రాగునీరు,నీడ పందిల్లు వేయాలని నిర్వాహకులకు సూచించారు.ట్యాబ్ ఎంట్రీ వెంట వెంటనే చేసి రైతులకు డబ్బులు అకౌంట్ లో పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.విద్యార్థుల స్కూల్ యూనిఫామ్ కుట్టే నిమిత్తం ప్రతి విద్యార్థిది కొలతలు తీసుకున్న ఆన్లైన్ లో ఎంటర్ చేయాలన్నారు.యూనిఫామ్ కుట్టే మహిళా సంఘ సభ్యులకు మంచి ఆదాయం కల్పించాలన్నారు. మహిళా సంఘ సభ్యులకు బీమా,ప్రమాద బీమా పెండింగ్ లేకుండా ఆన్లైన్లో వెంటనే ఎంట్రీ చేయాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం చామంతుల శ్రీనివాస్, సీసీలు రాజిరెడ్డి, గంగరాజు,నజీర్,మెహర్, మన్సూర్,స్వప్న,శ్రావణ్,అంజయ్య, శ్రీనిధి మేనేజర్ అమల,సిబ్బంది నరేందర్,రవి పాల్గొన్నారు

# జాబ్ డ్రైవ్ లో 10 మంది విద్యార్థులు ఎంపిక

## - డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే విజయ్ కుమార్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల ,కామారెడ్డి లో కళాశాల టి యస్ కె సి మరియు లైఫ్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో ఎమ్మెస్ఎన్ ఫార్మ కంపెనీ సంస్థలలో ఉద్యోగాల కొరకు మంగళవారం నిర్వహించిన జాబ్ డ్రైవ్ లో 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డా కె విజయ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో మారుతున్న కాలానికనుగుణంగా తమను తాము ఎప్పటికపుడు అభివృద్ధి పరుచుకుంటూ ఉండాలని మరియు నైపుణ్యాల కొరత కారణంగా ఉద్యోగాల వేటలో వెనుకబడి పోతున్నారని విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకొని ఆకాశమే హద్దుగా ఉన్నత స్థానంలో ఉండాలని జాబ్ డ్రైవ్ కు హాజరైన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా కె. కిష్టయ్య మాట్లాడుతూ మనకు ఉద్యోగాలు కల్పించడానికి అనేక కంపెనీలు ముందుకు వస్తున్నాయని, విద్యార్థులు తగిన నైపుణ్యాలతో సిద్ధంగా ఉండాలని కోరారు.ఈ జాబ్ మేళాలో లైఫ్ సెన్సెస్ అధ్యాపకులు డాక్టర్ దినకర్ చిన్న, డాక్టర్ జి. శ్రీనివాసరావు, తిరుమల మల్సూర్, ఎమ్మెస్ఎన్ ఏజీఎం కే.మోహన్, సీనియర్ మేనేజర్ బ్రహ్మారెడ్డి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసును చేదించిన పోలీసులు

**సూర్య- నవీపేట్:**



మహిళ మెడలో నుంచి మంగళసూత్రాన్ని దొంగిలించిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసి మంగళసూత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 18న మండలంలో గల ధర్మారం గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన ఒక మహిళ వరి ధాన్యాన్ని ఆరబోసి చెట్టు కింద కూర్చుని ఉండటాన్ని గమనించిన ఇద్దరు యువకులు ఆమె వద్దకు వెళ్లి మెడలోని మంగళసూత్రాన్ని బలవంతంగా తెంపి దొంగిలించిన ఘటనలో బాధితురాలు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి మంగళవారం ఉదయం ఏఆర్పి క్యాంప్, ఎడపల్లికి చెందిన సాయికుమార్, పవన్ కళ్యాణ్ అనే ఇద్దరు వ్యక్తులను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. వారి వద్దనుండి రెండు బంగారు పుస్తెలు, నాలుగు బంగారు గుండ్లు రికవరీ చేయడంతో పాటు దొంగతనానికి ఉపయోగించిన బైకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపినారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో బంగారం విలువ ఎక్కువగా ఉండటం వల్ల రానున్న రోజులలో చైన్స్ స్నాచింగ్ లు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది కాబట్టి మహిళలు ముఖ్యంగా ఒంటరిగా తిరిగే మహిళలు, యువతులు బంగారు ఆభరణాలు వేసుకొని వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఆభరణాలు బయట కనబడకుండా చున్నీ గాని, కొంగు గాని కప్పుకొని ఉంటే నేరాలు తగ్గే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**సూర్య నిజాంసాగర్**




సైబర్ నేరాలపై విద్యార్థులకు నిజాంసాగర్ పోలీసులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట మోడల్ స్కూల్లో తరగతి గదిలో ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల భారీ నుండి ఎలా బయటపడాలో విద్యార్థులకు సలహాలు సూచనలను కానిస్టేబుల్ ప్రవీణ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా సమాచారం ఉంటే 100 కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రభంజనం

**సూర్య మాక్లూర్**

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు.మండల కేంద్రంలో గల కేజీబీవి కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులు 80%,2వ,సంవత్సరం విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 16%,రెండవ సంవత్సరం 40% ఉత్తీర్ణులయ్యారు.దాస్ నగర్ మహాత్మ జ్యోతి భాపులే కళాశాల మొదటి సంవత్సర విద్యార్థినులు 86.27%,రెండవ సంవత్సరం విద్యార్థులు 92.25% ఉత్తీర్ణత సాధించారు.విద్యార్థుల విజయానికి కృషి చేసిన అధ్యాపకులకు పలు కళాశాలల ప్రిన్సిపాల్స్ అభినందనలు తెలియజేశారు.

# తల్లిదండ్రులు పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వద్దు

## - టి జి ఎం ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య

**సూర్య నిజాంసాగర్**



తల్లిదండ్రులు తమ పిల్లల కు సెల్ ఫోన్లు ఇవ్వవ ద్దని టి జి ఎం ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య అన్నారు. మంగళవారం అచ్చంపేట మోడల్ స్కూల్ లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంటి వద్ద చదువుకునేలా చూడాలని, విద్యార్థులకు ఫోన్లు ఇవ్వవద్దని, మంచి క్రమశిక్షణతో ఉండేలా చూడాలని ఆమె సూచించారు. విద్యార్థులు పాఠశాల నుండి ఇంటికి తిరిగి వచ్చాక హోమం వర్క్ ను పూర్తిచేసేలా చూడాలన్నారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం,సూచనలు ఎంతో అవసరమన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు వాలీబాల్ క్యారం బోర్డ్ లాంటి పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జొన్న పంట కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

## - జిల్లా మేనేజర్ మహేష్ కుమార్


**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



రెడ్డి జిల్లాలోని71104 ఎకరాలలో జొన్న పంట వేయడం జరిగిందని జిల్లా మార్కెట్ మేనేజర్ మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు దీనికిగాను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులకు మద్దతు ధర కింటాలుకు 3371 /- రూపాయలు లభించడం కోసం 19 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు జొన్న పంట కొనుగోలు కేంద్రాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి మద్నూర్ జుక్కల్ బిచ్కుంద అంగరడా కార్యగం గాంధారి పిట్లం పుల్కల్ తిమ్మానగర్ గుంకుల్ బొర్లం పెద్ద కోడప్పగల్ చిన్న కొడుకు మల్లూరు అచ్చంపేట తాండూర్ కిచెన్నపేట్ కేంద్రాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు తెలంగాణ రాష్ట్రంలోనే జొన్నల పంట బాగా పెరిగిందని దానికి కారణం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు జనాల దిగుబడి పెంపును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జొన్నల కొనుగోలు ఎకరానికి 8.65 క్వింటాల నుండి 14 పెంచడం జరిగింది అన్నారు. కావున రైతులందరూ ఇది గమనించి తమ జొన్న పంటను 14% ఉండేటట్లుగా ఎండబెట్టి సకాలంలో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని ఆయన సూచించారు తేమ శాతం 14 శాతం ఉండేటట్లుగా జొన్న పంటను సరే ఒక పద్ధతిలో ఆరబెట్టి సకాలంలో అమ్ముకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న బీర్ఎస్ నాయకులు

**సూర్య ఏర్గట్ల**



నిజామాబాద్ జిల్లాఏర్గట్ల మండల కేంద్రంలోని బిఆర్ఎస్ నాయకులు ఏర్గట్ల గ్రామ కమిటీ మాజీ అధ్యక్షులు కొలిపాక రవి, బిఆర్ఎస్ కార్యకర్త జక్కుల నడ్పి భూమన్న మంగళవారం రోజు జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్ రెడ్డి పాలన నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. ఇప్పటినుండి కాంగ్రెస్ పార్టీకి అండదండగా ఉంటూ ముత్యాల సునీల్ కుమార్ కు మద్దతుగా పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలోముస్కు మోహన్, పన్నాల నర్సారెడ్డి, ఏలేటి మోహన్, సురకంటి చిన్న రాజేశ్వర్,బద్దం లింగారెడ్డి, మేకల సాయన్న,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# ఎల్.ఆర్.ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు అవకాశం - ఈ నెల 30లోగా చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తింపు**

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

**సూర్య నిజాంబాద్ జిల్లా ప్రతినిధి**

అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ నిర్ణీత గడువు లోగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారితో కలిసి రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ నాటితో ఎల్ ఆర్ ఎస్ రాయితీ గడువు ముగుస్తుందని, దానిని పొడిగించబోమని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లాలో అర్హులైన వారందరు ఎల్ ఆర్ ఎస్ రాయితీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని గుర్తు చేశార ఎఫ్.టి. ఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్.ఆర్.ఎస్ కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించుకో వచ్చని అన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తును అధికారులు పరిశీలించి వెంటదివెంట అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది తమ ప్లాట్లను, అనధికార లే ఔట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారని అన్నారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి, అందులో 10 శాతం ప్లాట్లను



విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని కలెక్టర్ సూచించారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి క్రమ బద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు.

క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అర్హులైన వారందరు ఏప్రిల్ 30వ తేదీ లోపు క్రమబద్ధీకరణ చేసుకోవాలని,,ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే ఈ గడువు మార్చి 31తో ముగియగా, ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించిందని అన్నారు. రాయితీ వర్తింపునకు ఇదే చివరి అవకాశం అని కలెక్టర్ స్పష్టం చేశారు

## కేజీబీవీ విద్యార్థులకు బంక్ బెడ్స్ పంపిణీ

**సూర్య మాక్లూర్**



మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళ వారం ( బంక్ బెడ్స్) డ్యూయల్ మంచాల వితరణ చేశారు.విద్యార్థులు క్లబ్ సభ్యులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యాలయంలో విద్యార్థినులకై రూ. 17 లక్షల విలువ గల డ్యూయల్ మంచాలు అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు బిరెల్లి విజయరావు, బాలకోటిరెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సందర్శనకై వచ్చినప్పుడు బాలికలు క్రింద పడుకొవడం చూసి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు డ్యూయల్ మంచాలు అందజేయాలని నిర్ణయించి బిజిఆర్ సంస్థ తరపున సిఎస్ఆర్ ఫండ్ క్రింద అందజేసినట్లు తెలిపారు. విద్యార్థినులు బాగా చదివి భవిష్యత్ లో సుస్థిర స్థానాలు సంపాదించుకోవాలని కోరారు. ఇందులో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ కుమార్,నిర్మల్ జిల్లా ఏసిపి ఉపేందర్ రెడ్డి,మిషన్ భగీరథ సూపరిండెంట్ రాజేంద్ర కుమార్, అసిస్టెంట్ గవర్నర్ జ్ఞాన ప్రకాష్, జితేంద్ర మలాని,సమగ్ర శిక్షాధికారి భాగ్యలక్ష్మి,కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి,గంగా రెడ్డి,శ్రీనివాస్ రావు, భారత్ పటేల్, బాబురావు, శ్యాంసుంధర్,పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భూభారతిపై రైతులకు అవగాహన కలిగించిన అదనపు కలెక్టర్


**సూర్య బాల్కొండ**



బాల్కొండ మండల కేంద్రం ఎంకే గార్డెన్ లో నిజామాబాద్ అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రైతులకు ప్రజలకు భూభారతి పై అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ధరణి, భూ భారతి కి మధ్య వ్యత్యాసాలు, దరఖాస్తుదారులకు ఇబ్బందులు లేకుండా భూ భారతిలో పొందుపరచిన అంశాలపై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో నెలకొన్న భూ సమస్యలకు భూ భారతి ద్వారా శాశ్వత పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. మనుషులకు ఆధార్ నెంబర్ మాదిరిగా భూములకు భూధార్ నెంబర్ ఇస్తారని వెల్లడించారు. రైతులు భూ సమస్యల సూచనలను సలహాలను అడిగి తెలుసుకున్నారు, కార్యక్రమంలో ఆర్డీవో రాజా గౌడ్, తాసిల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగుల బదిలీలపై పిసిసి, ఎమ్మెల్యే లకు వినతిపత్రం

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



రెవెన్యూ ఉద్యోగుల బదిలీలపై స్పందించాలంటూ పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ని JAC ఆధ్వర్యంలో ఉద్యోగ సమస్యలపై కలిసి వినతిపత్రం సమర్పించ డమైనది. తహసీల్దార్ల, నాయబ్ తహసీ ల్దార్ బదిలీల విషయమై రెవెన్యూ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు రమన్ రెడ్డి భూభారతి చట్టం అమలులో భాగంగా జిల్లాకు సంబంధించిన తహసీల్దార్లు ఉంటే ప్రజలకు అటు ప్రభుత్వానికి ఎంతో మేలు జరుగుతుందని కాబట్టి ఎలక్షన్ లో బదిలీ అయినటువంటి తహసీ ల్దార్లను, నాయబ్ తహసీల్దార్ లను ముందుగా ఎవరి జిల్లాలకు వారిని బదిలీలు చేపట్టవలసిందిగా కోరారు. జిల్లాలో. మండలాల్లో ఉన్నటువంటి భూ సమస్యలు స్థానిక తహసీల్దార్లకు పూర్తి అవగాహన ఉంటుందని కాబట్టి అట్టి భూ సమస్యలు తొందరగా పూర్తి అవుతాయని వివరించారు, కావున ఎలక్షన్ లో భాగంగా బదిలీ పై వెళ్లిన తహసీల్దార్లను మరియు నాయబ్ తహసీల్దార్లను వెంటనే వారి వారి జిల్లాలకు బదిలీలు చేపట్టాల్సిందిగా మనవి చేశారు ఈ విషయానికి జేఏసీ చైర్మన్ సుమన్ కుమార్ కన్వీనర్ అలుక కిషన్ కో చైర్మన్ రమన్ రెడ్డి, TNGO కార్యదర్శి శేఖర్ మరియు JAC లో ఉన్న వివిధ నాయకులు సంఘీభావం తెలియజేశారులి TRESA ప్రధాన కార్యదర్శి (ఏవో) బి ప్రశాంత్ కుమార్, ఉపాధ్యక్షులు భూపతి ప్రభు, కలెక్టరేట్ సూపర్డెంట్ శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులు ఏ శ్రీకాంత్, P సంతోష్ ,సంపత్ తహసిల్దార్లు నాగర్జున బాల్ రాజ్ అనిరుద్, కలెక్టరేట్ కార్యవర్గం నవీన్,సంతోష్, రాజేశ్వర్ మోహన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఎల్లమ్మకు ఘనంగా బోనాలు

**సూర్య,లింగంపేట్**



లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో మంగళ వారం ఎల్లమ్మకు ఘనంగా గౌడ కుల స్తులు బోనాల తీశారు. గౌడ కుల స్తుల ఆరాధ్య దైవమై న ఎల్లమ్మ తల్లికి ఇంటికో బోనం తీసి ప్రధాన వీధుల గుండా ఊరేగిం పుగా శివశత్తుల,ఆట పాటలతో బోనాలు ఎల్లమ్మ ఆలయం వరకు కొనసా గాయి. తమను తమ పిల్లలను చల్లంగా చూడాలని ఎల్లమ్మ తల్లిని వేడు కున్నారు. గౌడ కులస్తులు ఏప్రిల్ మాసంలో ఎల్లమ్మకు బోనాలు తీయడం ఆనవాయి తీగా వస్తుంది.ఈ కార్యక్రమంలో గౌడ కుల పెద్దలు, మహిళలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో గిరిజన బాలికల పాఠశాల, ఆదర్శ పాఠశాల విద్యార్థులు ముందంజ

**- ర్యాంకులు తెచ్చుకున్న మాలోత్ అఖిల , అశ్వినీ లను అభినందించిన ప్రిన్సిపల్ సావిత్రి**

**సూర్య ఎల్లారెడ్డి.**





మంగళవారం ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన ఫలితాలలో ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాల కు చెందిన మాలోత్ అఖిల ఎంపీసీ ఇంటర్ మొదటి సంవత్సరం లో 416 మార్కులు సాధించి మండల ంలో మొదటి స్థానంలో నిలిచింది , సెకండ్ ఇయర్ బైపిసి విభాగంలో అశ్విని 949 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సావిత్రి మంగళ వారం తెలిపారు . ఎల్లారెడ్డి ఆదర్శ కళాశాలకు చెందిన విద్యార్థి దిల్ నాజ్ బైపీసీ ద్వితీయ సంవత్సరంలో 959 మార్కులు , ఎంపీసీలో అర్చన 957 మార్కులు సాధించారు, ప్రథమ సంవత్సరంలో బైపీసీ విభాగంలో గణేష్ 394, ఎంపీసీ విభాగంలో మూడు 383 మార్కులు సాధించినట్లు ప్రిన్సి పాల్ గాంధీ తెలిపారు . అదేవిధంగా సాంఘిక సంక్షేమ గురుకుల కళా శాలకు చెందిన మధుసూదన్ మొదటి సంవత్సరం బైపీసీలో 383, ద్వితీయ సంవత్సరంలో భానుచందర్ రెడ్డి , ప్రమోద్ లకు బీపీసీలో 951, ఎంపీసీ విభాగంలో లోకేష్ 918 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు ప్రభుత్వ కళాశాలలో చదివి కార్పోరేట్ కళాశా లలకు దీటుగా మార్కులు సాధించినందుకు స్థానికులు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు

## భూభారతి చట్టంతో భూ సమస్యలు లేని గ్రామాలుగా రూపుదిద్దు కుంటాయి

**-ఆర్డీవో మన్నె ప్రభాకర్**

**సూర్య,లింగంపేట్**



భూభారతి చట్టంతో లింగంపేట్ మండలంలోని అన్ని గ్రామాలు భూ సమస్యలు లేని గ్రామాలుగా రూపుదిద్దు కుంటా యని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. మండలంలోని లింగంపేట్ మండలంలోని మెంగారం,ఎల్లారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూభారతి సదస్సులో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ భూభారతి చట్టంతో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. భూ సమస్యలకు సంబంధించిన ఆధారాలను భూభారతి దరఖాస్తులో వివరాలు స్పష్టంగా పొందుపరచాల న్నారు.భూభారతి చట్టంపై ఆయన రైతులకు అవగాహన కలిగించారు. ఎల్లారంలో 83,మెంగారంలో 81 దరఖాస్తులు వచ్చాయని తహసిల్దార్ సురేష్ తెలిపారు.రెవెన్యూ సదస్సులో రెవెన్యూ ఇన్స్పెక్టర్ కిరణ్,సీనియర్ అసిస్టెంట్ భరత్,జూనియర్ అసిస్టెంట్ లు రవి,లక్ష్మణ్, సాయిలు,తహాసిల్దార్ బృందం పాల్గొన్నారు.

## నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్ఐ లు బదిలీలు

**సూర్య - మోపాల్,**




నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఎసైలు బదిలీ అయ్యా రు. ప్రత్యేకించి ఆరోపణలు ఉన్న పలువురిని విధుల నుంచి తప్పిం చారు. జక్రాన్ పల్లి తిరుపతిని వీఆర్ కు అటాచ్ చేసారు. అలాగే ఆర్మూర్ పీఎస్ ఎసై -1,మహేష్ ను సైతం వీఆర్ కు పంపించారు. మెండోరా ఎసై నారాయణను వీఆర్ కు అటాచ్ చేశారు. సీసీఎస్ లో ఉన్న రమేష్ ను ఆర్మూర్ పీఎస్ ఎసై గా -1గా నియమించారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచందా పీఎస్ ఎసై మాలిక్ రెహమాన్ ను జక్రాన్ పల్లి ఎసై గా బదిలీ చేసారు. రెండో టౌన్ లో ఉన్న ఎసై యాసిర్ అరపత్ మెండోరా ఎసై గా నియమించారు. జగిత్యాల్ వీఆర్ లో ఉన్న సయ్యద్ ఇమ్రాన్ రెండో ఎసై - 1గా ట్రాన్సపర్ చేసారు. కాగా సీపీ సాయి చైతన్య పలువురి పని తీరుపై అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే తాజా బదిలీలు జరిగినట్లు తెలుస్తుంది.

## ఎక్సైజ్ స్టేషన్ను ప్రారంభించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**సూర్య బోధన్**



బోధన్ పట్టణంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ను ఎమ్మెల్యే సుదర్శ న్ రెడ్డి ప్రారంభించారు. నిజామా బాద్ జిల్లా ఉమ్మడి ఎక్సైజ్ పోలీస్ అధికారులు మల్లారెడ్డి,డీసీ సోమి రెడ్డి, సిఐ భాస్కర్ రావు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్, ఏసీపీ, ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హాందాన్, గ్రంథాలయ ఛైర్మన్ రాజిరెడ్డి, బోధన్ కాంగ్రెస్ నాయకులు తూము శరత్ రెడ్డి, దాము, నాగేశ్వరరావు, హరికాంత్ చారి, పౌల్, అల్లె రమేష్, సంజీవ్ రెడ్డి, గుండెడి శంకర్, తలారి నవీన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో నిజాంసాగర్ మండల టాపర్గా కేజీబీవీ విద్యార్థిని కే.రాగిణి

**సూర్య నిజాంసాగర్**



మంగళవారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో నిజాంసాగర్ మండల టాపర్గా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని కే రాగిణి నిలిచారు. కేజీబీవీ లో ఎం పి హెచ్ డబ్ల్యు గ్రూప్ లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 981 మార్కులు సాధించి కే.రాగిణి మండల టాపరుగా నిలిచారు. కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం లో ఎం పి హెచ్ డబ్ల్యు గ్రూప్ లో 27 మంది విద్యార్థులకు గాను 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, ఎం పి హెచ్ డబ్ల్యు ద్వితీయ సంవత్సరంలో సైతం 25 మంది విద్యార్థులకు గాను 25 మంది విద్యార్థులు ఉత్తీర్ణమి సాధించారు. సీఈసీ లో మొదటి సంవత్సరంలో 25 మంది విద్యార్థులకు గాను 20 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ఐదుగురు విద్యార్థులు ఫెయిలయ్యారు. సీఈసీ ద్వితీయ సంవత్సరంలో 17 మంది విద్యార్థులకు గాను 13 మంది ఉత్తీర్ణత సాధించగా నలుగురు ఫెయిలయ్యారు. తెలంగాణ మోడల్ స్కూల్ అచ్చంపేటలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి గ్రూపులో సిహెచ్ హారిక వెయ్యి మార్కులకు గాను 948 మార్కులు సాధించి నిజాంసాగర్ మండల రెండవ టాపర్గా నిలిచారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో సానియా 500 మార్కులకు గాను 439 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్లో ఎంపీసీ లో 36 మంది విద్యార్థులకు గాను 23 మంది ఉత్తీర్ణులవగా 13 మంది ఫెయిలయ్యారు. బైపిసి లో 31 మంది విద్యార్థులకు గాను 9 మంది ఉత్తీర్ణులవగా 22 మంది ఫెయిలయ్యారు. సీఈసీ లో 29 మంది విద్యార్థులకు గాను 15 మంది ఉత్తీర్ణులవగా 14 మంది ఫెయిలయ్యారు. సెకండ్ ఇయర్ లో ఎంపీసీ గ్రూపులో 27 మంది విద్యార్థులకు గాను 23 మంది ఉత్తీర్ణులవగా నలుగురు ఫెయిలయ్యారు. బైపీసీలో 37 మంది విద్యార్థులకు గాను 34 మంది విద్యార్థులు ఉత్తీర్ణులవగా ముగ్గురు ఫెయిలయ్యారు. సి ఈ సి లో 29 మంది విద్యార్థులకు గాను 18 మంది ఉత్తీర్ణులవగా 11 మంది ఫెయిల్ అయ్యారు. టీఎస్ డబ్ల్యూ ఆర్ ఐ ఈ ఎస్ అచ్చంపేటలో మొదటి సంవత్సరంలో సీఈసీ లో 27 మంది విద్యార్థులకు గాను 22 మంది విద్యార్థులు ఉత్తీర్ణులవగా ఐదుగురు ఫెయిల్ అయ్యారు. ద్వితీయ సంవత్సరంలో సీఈసీ లో 26 మంది విద్యార్థు లకు గాను 21 మంది ఉత్తీర్ణులవగా ఐదుగురు ఫెయిల్ అయ్యారు. మండల మొదటి టాపర్గా నిలిచిన కే రాగిణి, మరియు మండల రెండవ టాపర్ గా నిలిచిన సిహెచ్ హారిక లకు మండల విద్యాశాఖ అధికారి తిరుపతి రెడ్డి అభినందించారు.

## పాఠశాలలోని పిల్లల పట్ల ఎటువంటి లైంగిక దాడులు జరగకుండా ప్రాథమిక దశలోని అణిచివేసేందుకు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నియామకం

**-అదనపు కలెక్టర్ వి విక్టర్**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటి సారిగా ప్రతి పాఠశాల నుండి ఒక చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లను నియమించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ తెలిపారు. సోమవారం మరియు మంగళవారం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో జిల్లాలోని అన్ని MPPS, Govt(DNT), Govt High Schools, private స్కూల్స్ లోని 807 HMs మరియు 553 చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లకు రెండు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. నియమించబడిన ప్రొటెక్షన్ ఆఫీసర్ పాఠశాలలలో పిల్లల పట్ల ఎటువంటి లైంగిక దాడులకు గురికాకుండా వాటికి ప్రారంభ దశలోనే అణిచివేసే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. స్టూడెంట్ లాగా కాకుండా మన పిల్లలుగా భావించాలని, పిల్లలలో మనం నమ్మకం అనేది కల్పించాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమాలను చూసి వేరే జిల్లా వారు కూడా మన జిల్లాను ఆదర్శంగా తీసుకుంటున్నారని తెలపడం జరిగింది. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లాలోని అన్ని పాఠశాలలకు 7 విడతల వారీగా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. దాదాపు మొత్తం 2013 మంది ఈ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారని తెలిపారు. అదనపు సుపరిండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ చైతన్య రెడ్డి ఐపీఎస్ గారు మాట్లాడుతూ పిల్లలపై అసభ్యకరమైన సంఘటన జరిగిన ఎడల ఆ పాఠశా ల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పు చేసిన వారిపై కేసు లు నమోదు చేయించాలని తెలపడం జరిగింది. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ గా మీ బాధ్యతలు పిల్లల పట్ల నిర్వహించాలని చెప్పడం జరిగింది.పోక్సో కేసులు జరిగినప్పుడు పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలను వివరించారు. ఈ రకమైన కేసులలో తల్లిదండ్రులు మరియు టీచర్ల బాధ్యతలను కూడా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, జిల్లా బాలల పరిరక్షణ అధికారి స్రవంతి, శ్రీమతి స్వర్ణలత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కామారెడ్డి సుకన్య ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ డేవిడ్ రాజ్ హైదరాబాద్ గారు బాల రక్షాబంధన్ సిబ్బంది హాజరు కావడం జరిగింది.

## నాగిరెడ్డి పేట్ మోడల్ స్కూల్ కళాశాలలో 39 శాతం ఉత్తీర్ణత

**సూర్య ,నాగిరెడ్డిపేట్**





నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 39 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 102 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు ఆయన తెలిపారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 67 మంది పరీక్షలకు హాజరు కాగా అందులో 8 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ సెకండియర్ లో కళాశాలకు చెందిన ఎంపీసీ విద్యార్థిని బి .అంజలి 912/1000 మార్కులు సాధించి కాలేజీ టాపర్ గా నిలిచిందన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థిని కే .హారిక 446 / 470 మార్కులు సాధించినట్లు ఫస్ట్ ఇయర్ లో టాపర్ గా నిలిచినట్టు ఆయన తెలిపారు.

# ఇంటర్ ఫలితాలు

## 59.25 పాస్ ఇంటర్ విద్య అధికారి రవికుమార్

**సూర్య ఇందూర్**



2024-25 విద్యా సంవత్సరానికి గాను గత మార్చి నెలలో జరిగిన ఇంటర్ వార్షిక పరీక్షలలో జిల్లాలో రెండవ సంవత్సరం విద్యార్థులు 59.25% ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో విద్యార్థులు 53.37% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కాగా బాలికల ఉత్తీర్ణత శాతం పైచేయిగా నిలిచింది. మొత్తం బాలికలు రెండవ సంవత్సరంలో 70% మంది ఉత్తీర్ణులు కాగా, బాలురు 45 శాతం ఉత్తీర్ణత సాధించారు.అలాగే మొదటి సంవత్సరంలో బాలికలు 64% సాధించగా బాలురు 41 శాతం ఉత్తీర్ణత సాధించారు.నిజామాబాద్ జిల్లాలో రెండవ సంవత్సరం జనరల్ కోర్సులలో మొత్తం విద్యార్థులు 13,945 మంది హాజరు కాగా వీరిలో 8,117 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలికలు 7,657 మంది హాజరుకాగా 5,309 మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా బాలురు 6,288 మంది పరీక్షలకు హాజరు కాగా 2,808 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే రెండవ సంవత్సరం ఒకేషనల్ లో మొత్తం 2,042 మంది విద్యార్థులు హాజరుకాగా 1,231 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలికలు 814 మంది పరీక్షలకు హాజరుకాగా 666 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 1,228 మంది పరీక్షలకు హాజరు కాగా 565 మంది ఉత్తీర్ణులయ్యారు.మొదటి సంవత్సరం జనరల్ కోర్సుల విద్యార్థులు మొత్తం 15,056 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 8,035 మంది ఉత్తీర్ణులు అయ్యారు. వీరిలో బాలికలు 8,074 మంది హాజరు కాగా 5,191 మంది ఉత్తీర్ణులయ్యారు.కాగా బాలురు 6,982 మంది పరీక్షలకు హాజరు కాగా 2,844 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 2,790 మంది పరీక్షలకు హాజరుకాగా 1,223 ఉత్తీర్ణులయ్యారు. కాగా బాలికలు 1,111 మంది హాజరు కాగా వీరిలో 756 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 1,679 మంది పరీక్షలకు హాజరుకాక 467 మంది ఉత్తీర్ణులయ్యారు.

## రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించిన అంతంపల్లి విద్యార్థిని

**సూర్య- బిక్కనూర్**

ఇంటర్ ఫలితాలలో మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని వలకొండ చర్విత ఎంపీసీలో 995 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధిం చింది. అంతంపల్లి సింగిల్ విండో సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి- అనురాధ దంపతుల రెండవ కూతురైన చర్విత చిన్నప్పటినుండి ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఇంటర్మీడియట్లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, మండలవాసులు రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన చర్వితను అభినందించారు.

## కాలేజ్ టాపర్ గా నిలిచిన స్వజిత విశ్వామితి

**సూర్య రాజంపేట**

రాజంపేట మండల కేంద్రానికి చెందిన సతీష్ శ్రీపర్ణ ల కూతురు స్వజిత విశ్వామితి శ్రీ గాయత్రీ కాలేజీ, మల్లపేట, హైదరాబాద్లో కాలేజీ టాపర్గా నిలవడం గర్వకారణమని తెలిపారు అద్భుత ప్రతిభతో కాలేజీలో ఉత్తమ ప్రతిభ కన బర్చిందని అభినంది ంచారు. ఈ సందర్భంగా స్వజిత విశ్వామితి ఆమె తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు గ్రామస్థుల నుండి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. భవిష్యత్తులో కూడా ఈవిధంగానే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ పలువురు ఆశీర్వాదాలు తెలిపారు. స్వజిత విశ్వామితి ఈ విజయాన్ని తన తల్లిదండ్రులు సతీష్ శ్రీపర్ణ ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం ఫలితంగా అభివర్ణించింది.

# ధరణి స్థానంలోనే భూభారతి చట్టం

**- కలెక్టర్**

**సూర్య- బిక్కనూర్**




రైతులకు తమ భూములపై హక్కులను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చిందని, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో భూభారతిపై ప్రజా ప్రతినిధులకు రైతులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూధరణీ స్తానంలో భూభారతి భూమి హక్కుల చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే,పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని, 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామ ద్వారా కొనుగోలు చేసి, గడచిన 12 ఏండ్లుగా అనుభవంలో ఉంటూ 12.10. 2020 నుండి 10.11.2020 మధ్య కాలంలో క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్,స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. అట్టి వాటిని రికార్డులలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఆర్డీఓ వీణ, ఎమ్మార్వో శివ ప్రసాద్, ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు

## రోడ్డు భవనాల శాఖ అధికారికి బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత

**-ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం**

**- రోడ్డు భవన శాఖ అధికారి నారాయణ**

**సూర్య ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి మున్సిపల్ పట్టణ కేంద్రంలో నీ బాలాజీ నగర్ తాండ 4 వార్డ్. లో ఎల్లారెడ్డి కామారెడ్డి రోడ్డు పక్కన డిగ్రీ కాలేజ్ దగ్గర బాలాజీ నగర్ తండా పక్కనుంచి అడవి లింగాల గ్రామానికి లింకు రోడ్డు వుండడంతో.మూడు రోడ్ల కూడలి వద్ద ఎలాంటి స్పీడ్ బ్రేకర్ లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని మంగళవారం స్థానిక ఆర్ అండ్ బి అధికారి నారాయణ కు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని వినీతిపత్రాన్ని బహుజన నాయకులు అందజేశారు అనంతరం బహుజన నాయకులు సాయిబాబా, లింగమయ్యలు మాట్లాడుతూ ప్రధాన రహదారిలో ఉన్న డిగ్రీ కళాశాల బాలాజీ నగర్ తాండవ వద్ద యాక్సిడెంట్ జరిగి హాస్పటల్ బారిన పడిన సందర్భాలు ఉన్నాయి ఇంకొంతమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా కోకొల్లలు అని అన్నారు. అందుకు స్పందించిన రోడ్డు భవనాల శాఖ అధికారి నారాయణ మాట్లాడుతూ ఇకముందు ప్రమాదాలు జరగకుండా కూడలి వద్ద మరి మూలములపల్లి వద్ద సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ ఎల్లారెడ్డి. నియోజక వర్గ అధ్యక్షులు మార్లుసాయి బాబు, స్థానిక.4 వార్డ్ బీసీ విద్యార్థి విభాగం కామారెడ్డి జిల్లా కార్యదర్శి డి. లింగమయ్య , వడ్డే సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**సూర్య నిజాంసాగర్**

సైబర్ నేరాలపై విద్యార్థులకు నిజాంసాగర్ పోలీసులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట మోడల్ స్కూల్లో తరగతి గదిలో ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల భారీ నుండి ఎలా బయటపడాలో విద్యార్థులకు సలహాలు సూచనలను కానిస్టేబుల్ ప్రవీణ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా సమాచారం ఉంటే 100 కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.